క్లుప్తంగా

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి కొలిచే భక్తులకు కొంగు బంగారంలా మారింది. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం సమర్పించారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్



బాధితుడికి ఎల్‌ఓసీ అందజేస్తున్న కేఎల్లార్

పహాడీషరీఫ్: ఆపదలో ఉన్న వారికి సీఎంఆర్‌ఎఫ్ ఎంతో ఆసరాగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీకి చెందిన కల్యాణ్‌రావు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి, స్థానిక కౌన్సిలర్ కంచె లక్ష్మీనారాయణ సహకారంతో ఎల్‌ఓసీకి దరఖాస్తు చేసుకున్నాడు. అనారోగ్య తీవ్రత దృష్ట్యా అతనికి రూ.2.5 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కును లక్ష్మీనారాయణతో కలిసి బాధితుడికి మంగళవారం కేఎల్లార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వంట గ్యాస్ సబ్సిడీ, ఉచిత విద్యుత్ లాంటి సదుపాయాలు కల్పించారన్నారు. వైద్య రంగానికి కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్ పెద్దపీట వేస్తుందని ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చింతకింది నవీన్‌గౌడ్, యూసుఫ్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

బీటీరోడ్డుకు మరమ్మతులు



మరమ్మతు చేయిస్తున్న అధికారులు

మహేశ్వరం: నాగారం–పెద్ద గోల్కొండ ఔటర్ రింగ్‌రోడ్డు వరకు గుంతలమయమైన బీటీ రోడ్డును ఆర్‌అండ్‌బీ అధికారులు కాంట్రాక్టర్‌తో మంగళవారం కంకర, డస్ట్ మిక్షర్‌తో పూడ్చివేసి మరమ్మతులు చేపట్టారు. గుంతల రోడ్డుతో నిత్యం వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో ఇటీవల స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి మరమ్మతులు చేపట్టాలని విన్నవించారు. అనంతరం ఆమె అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించడంతో రోడ్డు కాంట్రాక్టర్ గుంతలను కంకర, డస్ట్, మిక్షర్‌తో పూడ్చివేశారు. త్వరలో రోడ్డు వెడల్పు పనులు చేపడుతామని అధికారులు తెలిపారు. గుంతలను పూడ్చడంతో గ్రామస్తులు, వాహనదారులు ఆనందం వ్యక్తం చేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న పొన్న రాజీవ్‌రెడ్డి

షాబాద్: దేవాలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని మల్లన్న దేవాలయ కమిటీ సభ్యులు పొన్న సుధాకర్‌రెడ్డి, దోనూరు గోపాల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ మల్లన్న దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న దేవాలయానికి తనవంతు ఆర్థిక సహాయంగా నాన్‌ంధార్‌ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన పొన్న రాజీవ్‌రెడ్డి రూ.50వేల చెక్కును విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు సుధాకర్‌రెడ్డి, దోనూరు గోపాల్, శంకరయ్య, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, లింగం తదితరులు ఉన్నారు.



పహాడీషరీఫ్: జల్‌పల్లి కమాన్ వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ వెంకట్రామ్



తుక్కుగూడలో ర్యాలీ తీస్తున్న అధికారులు, పాలకమండలి సభ్యులు

ఉత్సాహంగా ప్రజాపాలన విజయోత్సవాలు

పారిశుద్ధ్యంపై అవగాహన ర్యాలీలు

- పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరాలు
- కార్యక్రమాల్లో పాల్గొన్న వైద్యులు, నాయకులు, మహిళా సంఘాల సభ్యులు

బడంగ్‌పేట్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ప్రజా విజయోత్సవ సభను మంగళవారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లో పెద్దఎత్తున నిర్వహించారు. సిరిపురం యాదయ్య మున్సిపల్ ప్లే గ్రౌండ్ నుంచి కార్పొరేషన్ కార్యాలయం వరకు మేయర్ చిగురింత పారిజాత, కమిషనర్ సరస్వతి, కార్పొరేటర్లు, శానిటేషన్ సిబ్బంది, స్వయం సహాయక సంఘాలు, కాంగ్రెస్ నాయకులు కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉత్తమ శానిటేషన్ సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేశారు. ప్రభుత్వం విడుదల చేసిన రూ.3 కోట్ల చెక్కులను స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందజేశారు. స్వయం సహాయక బృందాల వారు కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసిన పలురకాల స్టాళ్లను సందర్శించారు. అదేవిధంగా శానిటేషన్ సిబ్బందికి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి అందరికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, డీఈఈ నర్సింహారాజు, ఏఈ వినీల్, మేనేజర్ నాగేశ్వర్‌రావు, ఆర్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, నాయకులు తదితరులు ఉన్నారు.

జల్‌పల్లి మున్సిపాలిటీలో..

పహాడీషరీఫ్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా జల్‌పల్లి మున్సిపాలిటీలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. జల్‌పల్లి కమాన్ వద్ద మున్సిపల్ కమిషనర్ జెండా ఊపి ప్రారంభించిన ఈ ర్యాలీ హైవే హోటల్ మీదుగా జేజీఆర్ గార్డెన్ వరకు కొనసాగింది. విద్యార్థులు, మున్సిపల్ సిబ్బందితో పాటు ఈ ర్యాలీలో బాలాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, పల్లవు శంకర్, శంషాద్దీన్, స్థానిక నాయకులు షేక్‌అఫ్జల్, యూసుఫ్ పటేల్, హసన్ షా తదితరులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి బాలాపూర్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ ఆదిత్య, డాక్టర్ ప్రియాంకలు సిబ్బందికి బీపీ, షుగర్, రక్త పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్లు సైదులు, సాయికుమార్, విజయ్‌తో పాటు మేరీ, మౌలానా, విజయ, అనిత తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాలలో భాగంగా మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య, ఎలక్ట్రిషియన్, వాటర్ వర్క్స్ కార్మికులకు కమిషనర్ వెంకట్రామ్ సన్మానించారు.

స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలి

తుక్కుగూడ: మున్సిపాలిటీని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పురపాలక సంఘం చైర్‌పర్సన్ బరిగెల హేమలతరాజుగౌడ్ సూచించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావిజయోత్సవాల్లో భాగంగా శ్రీశైలం జాతీయ రహదారిపై మున్సిపల్ సిబ్బంది, పాలక మండలి సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి పీపీఈ కిట్స్, మహిళా సంఘాల సభ్యులకు బ్యాంక్ చెక్కుల పంపిణీ, పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం, ఇందిరా మహిళా స్టాళ్ల తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ ఏ.వాణి, వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, మేనేజర్ పర్వతాలు, కౌన్సిలర్లు యాదగిరిరెడ్డి, శివకుమార్, పద్మ, భావన, విలాస్, రాజు, సీనియర్ అసిస్టెంట్లు వెంకటేశ్, జంగయ్య, మల్లేశ్, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది, నాయకులు

బడుగుల ఆత్మగౌరవాన్ని పెంచడమే ధ్యేయం

మీర్‌పేట: బడుగు, బలహీన, దళిత, గిరిజన వర్గాల ఆత్మగౌరవం పెంచడమే ఇందిరమ్మ రాజ్యం ధ్యేయమని, ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మీర్‌పేటలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్‌తో కలిసి పరిశుభ్రతపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి అనేది నిరంతరంగా జరగాలని, ఈ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బందికి నూతన యూనిఫాం అందజేశారు. వారి సేవలకు గుర్తింపుగా ప్రశంసాపత్రాలు, టిఫిన్ బాక్సులను పంపిణీ చేశారు. దీంతో పాటు ఇందిరా మహిళా శక్తి కింద స్వయం సహాయక గ్రూపు సభ్యులకు రూ.3 కోట్ల చెక్కును అందజేసి, మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. అనంతరం పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న, మేనేజర్ చంద్రప్రకాశ్‌రెడ్డి, ఆర్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి, అకౌంట్స్ అధికారి సుహాసిని, మెప్మా ఇన్‌చార్జి నర్సింహ, కార్పొరేటర్లు పోరెడ్డి పద్మ, గజ్జెల రాంచందర్, కీసర గోవర్ధన్‌రెడ్డి, విజయలక్ష్మి, బాలమణి, గౌరీశంకర్, పల్లె జంగయ్యగౌడ్, నాయకులు పాల్గొన్నారు.



స్వయం సహాయక గ్రూపులకు చెక్కు అందజేస్తున్న చైర్మన్ చల్లా, మేయర్ దుర్గా

'హామీల అమలులో విఫలం'



ప్రభుత్వంపై చార్జిషీట్ పత్రాలను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

తుక్కుగూడ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ఆరోపించారు. మంగళవారం మున్సిపాలిటీ కేంద్రంలో ఆ పార్టీ నాయకులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వంపై చార్జిషీట్ పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా.. ఇంతవరకు పూర్తిస్థాయిలో ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయలేదన్నారు. ప్రజలకు మాయమాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ప్రభుత్వంపై తమ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చడం ప్రశ్నించారు. ఆమె నియోజకవర్గ అభివృద్ధిని ఆమె పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సబితారెడ్డి పార్టీలు వేరు కానీ, ఇద్దరు ఒక్కటేనని ఎద్దేవా చేశారు. ఫోర్త్‌సిటీ రోడ్డు నిర్మాణం సందర్భంగా భూములు కోల్పోతున్న రైతులకు తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, సునితారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలత, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని అందుబాటులోకి తెస్తా



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: పేదలు నివాసం ఉంటున్న జల్‌పల్లి మున్సిపాలిటీలో ఏడాదిలోపు 30 పడకల ఆస్పత్రి నిర్మించేలా కృషి చేస్తానని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో 231 మంది మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం ఆమె పహాడీషరీఫ్‌లోని ప్రీమియర్ ఫంక్షన్‌హాల్‌లో చైర్మన్ అబ్దుల్లా సాది, బాలాపూర్ తహసీల్దార్ ఇందిరా, జల్‌పల్లి కమిషనర్ వెంకట్రామ్‌లతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేవలం ఒక్క జల్‌పల్లి మున్సిపాలిటీలోనే 4,600 మంది లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులను అందజేశామని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ పథకానికి రూ.1లక్ష నగదుతో పాటు తులం బంగారం అందజేయాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్ చుట్టూ ఉన్న మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు రూ.1200 కోట్ల వ్యయంతో రిజర్వాయర్లు, పైపులైన్ల పనులకు శ్రీకారం చుట్టారని చెప్పారు. ఇందులో ఆరు రిజర్వాయర్లు పూర్తి కావడంతో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క మహేశ్వరం నియోజకవర్గంలోనే 13 బస్తీ దవఖానాలు, తొమ్మిది యూపీహెచ్‌సీలు మంజూరు చేశారని వెల్లడించారు. కానీ ప్రస్తుతం ఈ బస్తీ దవఖానాల్లో వైద్యులు లేకపోవడంతో పాటు మందులు కూడా దొరకని దుర్భర పరిస్థితి నెలకొందన్నారు. ఇక బాలింతలకు ఇచ్చే కిట్‌ను కూడా మరిచారన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు గతంలో మంజూరైన రూ.50కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులను రద్దు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదలపై ప్రేమ ఉంటే వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సూరెడ్డి కృష్ణారెడ్డి, కైసర్ బామ్, షర్ఫొద్దీన్ హామెద్, షేక్ అఫ్జల్, యంజాల జనార్దన్, యూసుఫ్ పటేల్, ఎక్బాల్ ఖలీఫా, అలీ మన్సూరీ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల పేరుతో మోసం

- బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాములు యాదవ్



మాట్లాడుతున్న శ్రీరాములు యాదవ్

బడంగ్‌పేట్: ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ఆరోపించారు. మంగళవారం నాదర్‌గుల్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వందరోజుల్లో అమలు చేస్తామని, ఏడాది గడిచినా హామీలను అమలు పరచడం లేదని విమర్శించారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, నెలకు రూ.4వేల నిరుద్యోగ భృతి, తులం బంగారం, రుణమాఫీ చేస్తామని గొప్పలు చెప్పి ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. మహేశ్వరం నియోజకవర్గానికి సబితారెడ్డి ఇచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి సర్కారు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజల తరఫున బీజేపీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. నాయకులు శంకర్‌రెడ్డి, పాపయ్యగౌడ్, జంగయ్య యాదవ్, సుదర్శన్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, రాజుగౌడ్, రాధాధీరజ్ రెడ్డి, సంతోష్ తదితరులు ఉన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్



వైద్యురాలికి వినతిపత్రం అందిస్తున్న ఆశలు, సీఐటీయూ నాయకులు

కందుకూరు: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశవర్కర్లు మంగళవారం కందుకూరు పీహెచ్‌సీ ఎదుట మూడు గంటల పాటు ధర్నా నిర్వహించారు. అనంతరం వైద్యురాలికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ.. ఆశవర్కర్లతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తోందని మండిపడ్డారు. పని భారాన్ని తగ్గించి పెండింగ్‌లో ఉన్న సర్వే బిల్లులను విడుదల చేయాలని, నెలకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలన్నారు. గుర్తింపు కార్డులు, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలన్నారు. గతంలో కమిషనరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన సమయంలో ఇచ్చిన హామీలను నేటివరకు నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇప్పటివరకు ఆశవర్కర్ల సమస్యలు ఒక్కటి కూడా పరిష్కరించలేదని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 4వ తేదీన కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆశవర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు సరస్వతి, ఆ సంఘం సీనియర్ నాయకులు సుశీల, సంధ్య, భాగ్య, జయసుధ, శ్రీలత ఉన్నారు.

విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

మీర్‌పేట: రాష్ట్రం కోసం ఆత్మబలిదానం చేసుకున్న మహనీయుడు శ్రీకాంత్‌చారి అని మీర్‌పేట కార్పొరేషన్ 27వ డివిజన్ కార్పొరేటర్ పసునూరి భిక్షపతిచారి అన్నారు. మంగళవారం కాసోజు శ్రీకాంత్‌చారి 15వ వర్ధంతి సందర్భంగా సిర్లాహిల్స్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భిక్షపతిచారి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం కోసం విశ్వకర్మలు ముందుండి పోరాటం చేశారని, రాష్ట్రం వచ్చాక ప్రభుత్వాలు మర్చిపోయాయన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వకర్మలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసచారి, శివకుమార్‌చారి, వెంకటేశ్, డా.వెంకటేశ్, మోహన్, ఆంజనేయులుగౌడ్, అందె సత్తయ్య, శ్రీనివాస్‌సాగర్ పాల్గొన్నారు.

జిల్లెలగూడలో..

మీర్‌పేట బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో చందన చెరువు కట్టపై గల అమర వీరుల స్థూపం వద్ద శ్రీకాంత్‌చారి చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, నాయకులు బాలరాజు, గోపియాదవ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాంత్‌చారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ భిక్షపతిచారి తదితరులు

జీవాలకు టీకాలు వేయించాలి

షాబాద్: రైతులు మూగజీవాలకు పారుడు వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కేసారం, షాబాద్ గ్రామాల్లో సిబ్బందితో కలిసి మూగజీవాలకు పారుడు వ్యాధి టీకాలు వేశారు. రైతులు తప్పనిసరిగా తమ వద్ద గల మూగజీవాలకు టీకాలు చేయించాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గొర్రెలు, మేకలకు టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో రైతులు అందుబాటులో ఉండి జీవాలకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు ఉన్నారు.

ప్రాణాలు పోతున్నా స్పందించరా?

- హైదరాబాద్–బీజాపూర్ రహదారి విస్తరణ పనులు త్వరగా చేపట్టాలి
- బీఆర్‌ఎస్ నేతలు అనంతరెడ్డి, నర్సింహారెడ్డి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

మొయినాబాద్: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై ప్రజల ప్రాణాలు పోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించవా అని బీఆర్‌ఎస్ నేతలు కొంపల్లి అనంతరెడ్డి, కొత్త నర్సింహారెడ్డి ప్రశ్నించారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. 2021లోనే హైదరాబాద్–బీజాపూర్ రహదారి పనులు ప్రారంభమైనా ఇప్పటివరకు చేపట్టడం లేదన్నారు. రోడ్డు పనులు చేపట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. గ్రీన్ ట్రిబ్యూనల్‌లో కేసు ఉందని రోడ్డు విస్తరణ పనులు ఆపేస్తే రోడ్డు ప్రమాదాలు జరిగి వేల మంది నిండు ప్రాణాలు పోతున్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్పీకర్, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఈ రోడ్డుపై తిరుగుతున్నా వారికి రోడ్డు పరిస్థితి అర్థం కావడంలేదా అని మండిపడ్డారు. అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్లు రవూఫ్, వెంకట్‌రెడ్డి, డప్పు రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మాణిక్ రెడ్డి, మాజీ సర్పంచ్ సుధాకర్‌యాదవ్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు జయవంత్, నాయకులు భాస్కర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.